ఇంజిన్లు ఇచ్చారు..
ట్రక్కులు మరిచారు..!

- నీరుగారిన స్వచ్ఛ పంచాయతీల లక్ష్యం
- ట్రక్కులు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఇంజిన్లు
- అద్దె ట్రాక్టర్లతోనే పారిశుద్ధ్య నిర్వహణ



నిరుపయోగంగా ఉన్న మండపల్లి, తులసిగాం ఇంజిన్లు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి, చెత్త సంపద కేంద్రానికి తరలించి స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా రూపుదిద్దాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధిక జనాభా ఉన్న పంచాయతీలకు రూ.6 లక్షలు వెచ్చించి ట్రాక్టర్లు మంజూరు చేసింది. అయితే పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించేందుకు ట్రాక్టర్ ఇంజిన్లు ఇచ్చారు గానీ, చెత్తను తరలించేందుకు అవసరమైన ట్రక్కులు ఇవ్వడం మర్చిపోయారు. దీంతో లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఇంజిన్లు తుఫాన్ రక్షిత భవనాలు, గ్రామ సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో మూలకుచేరి మూలుగుతున్నాయి.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇచ్ఛాపురం మండలానికి సంబంధించి కేశుపురం, మండపల్లి, బూర్జపాడు, తులసిగాం పంచాయతీలకు, కవిటి మండలానికి సంబంధించి కపాసుకుద్ది, సహలాలపుట్టుగ, జగతి, మాణిక్యపురం, బెలగాం, నెలవంక పంచాయతీలకు, కంచిలి మండలం కొల్లూరు, సోంపేట మండలంలో కొర్లాం, బేసిరామచంద్రాపురం, ఉప్పలాం, మామిడిపల్లి పంచాయతీలకు ఇంజిన్లు అందజేశారు. ఐదు నెలలు క్రితం ఇచ్చిన వీటికి భద్రత లేకుండా ఉంచి అధికారులు సైతం చేతులు దులుపుకున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఆదిలోనే అవాంతరం ఏర్పడింది.

అద్దె ట్రాక్టర్లే దిక్కు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రభుత్వం ట్రక్కులు ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చెత్త సేకరణకు పంచాయతీ నిధులు వెచ్చించి అద్దె ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీలకు కేటాయించిన ఇంజిన్లను ఉంచేందుకు సరైన సదుపాయం లేకపోవడంతో అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. ఇలాగే మరో ఆరు నెలలు ఉంటే తుప్పు పట్టుకుపోతాయని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాక్టర్ ట్రక్కులు మంజూరు చేస్తే పారిశుద్ధ్య నిర్వహణ సాధ్యమవుతుందని సర్పంచ్‌లు కోరుతున్నారు.



దొంకూరు తుఫాన్ రక్షిత భవనంలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్ ఇంజిన్



అద్దె ట్రాక్టర్‌తో బూర్జపాడులో పారిశుద్ధ్య పనులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వం నుంచి కేవలం ట్రాక్టర్ ఇంజిన్లు మాత్రమే వచ్చాయి. వాటిని అధిక జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు పంపిణీ చేయడం జరిగింది. ట్రక్కులు ఇంత వరకు రాలేదు. ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగింది. ట్రక్కులు వచ్చిన వెంటనే సంబంధిత పంచాయతీలకు పంపిణీ చేయడం జరుగుతుంది.

– ఎస్.కృష్ణ, ఈవోపీఆర్డీ, ఇచ్ఛాపురం మండలం

పనులు ప్రారంభమెన్నడో..?



టెక్కలి పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర రోడ్డు విస్తరణ పనులు చేపడతామంటూ అధికారులు హడావుడి చేశారు. అంతేకాకుండా రోడ్డు పనుల ప్రారంభానికి సంబంధించి మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన సైతం చేశారు. ఇదే అదునుగా స్థానికంగా రోడ్డుకు ఇరువైపులా కొలతల మేరకు దుకాణాలు, ఇళ్లను తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. కానీ రోజులు గడుస్తున్నప్పటికీ రోడ్డు పనులు మొదలవ్వడం లేదు. రోడ్డుపైనే ఇళ్లు, దుకాణాలను తొలగించిన వేస్ట్ మెటీరియల్ వదిలేశారు. దీంతో ఈమాత్రం దానికి హడావుడిగా కూల్చివేతలు ఎందుకు చేపట్టారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

– టెక్కలి

తాగునీటికి ఇబ్బందులు



ఇచ్ఛాపురం రూరల్ మండలం కేశుపురం గ్రామ దళిత వాడలోని ప్రజలు గత మూడు రోజుల నుంచి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మోటారు బోరు మరమ్మతులకు గురవ్వడంతో మంచినీరు రావడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉంటున్న నేపథ్యంలో అధికారులు, నాయకులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

తాగునీరు వృథా



టెక్కలిలోని రోటరీనగర్–1కు వెళ్లే తెంబూర్ రోడ్డులో పైపులైన్లు మరమ్మతులకు గురవ్వడంతో తాగునీరు వృథాగా మారుతోంది. నిత్యం వందలాది లీటర్ల నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. అధికారులు అదే మార్గంలో వెళ్తున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. అందువలన ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– టెక్కలి రూరల్

అభాగ్యురాలికి ఆశ్రయం



శేషమ్మను ఆశ్రమానికి తీసుకెళ్లిన సీతయ్య ఫౌండేషన్ నిర్వాహకులు

కంచిలి: పక్షవాతంతో శేష జీవితం గడుపుతూ ఒంటరైన వృద్ధురాలికి మండలంలోని మండపల్లి గ్రామంలో ఉన్న సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం ఆశ్రయం కల్పించింది. భర్తను కోల్పోయి, సంతానం లేక, ఒంటరిగా సవరదేవిపేట గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు ఇసురు శేషమ్మ వృద్ధాప్యంతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న సీతయ్య ఫౌండేషన్ వారు గ్రామానికి వచ్చి శేషమ్మను తమతో ఆశ్రమానికి శనివారం తీసుకెళ్లారు.

కారుణ్య నియామకపత్రం అందజేత



నియామకపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కవిటి: జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అందించే కారుణ్య నియామకాలను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టడం ఆనందంగా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఈ మేరకు మండపల్లి ఒడియా స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మృతిచెందిన బంగారి గణేష్ కుమార్తె బంగారి శిరీషకు కారుణ్యనియామకం కింద, ఆఫీస్ సబార్డినేట్‌గా రాజపురం బాలుర ఉన్నత పాఠశాలలో నియమిస్తూ ఉత్తర్వులు శనివారం అందజేశారు. పారదర్శకంగా శిరీషకు ఉద్యోగం కల్పించడంలో తమవంతు బాధ్యతని నిర్వర్తించామన్నారు.

మున్సిపల్ సమావేశానికి ఆహ్వానించాలి



వినతిపత్రం అందజేస్తున్న స్వర్ణమణి

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపల్ సమావేశానికి తనను ఆహ్వానించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వినయ్ ప్రసాద్‌కు శనివారం వినతిపత్రం అందించారు. మార్చి నెలలో తన సభ్యత్వం రద్దు విషయంపై కౌన్సిల్ తీర్మానం చేసినా, అనర్హతపై న్యాయపరంగా తనకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు. మున్సిపల్ చట్ట ప్రకారం తనకు అన్ని హక్కులు ఉంటాయని పేర్కొన్నారు.

ఉపాధి చెరువులో యంత్రాలతో తవ్వకాలు



జీలుగుబంద చెరువులో యంత్రాలతో తవ్వకాలు

టెక్కలి: మండలంలోని బొప్పాయిపురం పంచాయతీ చల్లపేటకు ఆనుకుని ఉన్న జీలుగుబంద చెరువులో శనివారం కొందరు వ్యక్తులు యంత్రాలతో అక్రమ తవ్వకాలు చేపట్టి మట్టిని తరలించడం చర్చనీయాంశంగా మారింది. ఇదే చెరువులో ప్రస్తుతం ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ఉపాధి పనులు జరుగుతున్న చోట ఎటువంటి యంత్రాలతో తవ్వకాలు చేపట్టకూడదు. అయితే ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచేలా కొంత మంది వ్యక్తులు యంత్రాలతో అక్రమంగా తవ్వకాలు చేయడమే కాకుండా ఆ మట్టిని తరలిస్తున్నారు. దీనిపై ఉపాధి ఏపీఓ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా, ఉపాధి పనులు చేస్తున్న చోట యంత్రాలతో పనిచేస్తే అక్కడ ఉపాధి పనులు రద్దు చేయడమే కాకుండా శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మర్యాదపూర్వక భేటీ



తమ్మినేని సీతారాంను సన్మానిస్తున్న తిలక్ తదితరులు

టెక్కలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ సలహా కమిటీ సభ్యుడిగా తమ్మినేని సీతారాంను ఇటీవల పార్టీ అధిష్టానం నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలంతా ఆమదాలవలస చేరుకుని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు ఎన్.శ్రీరామ్మూర్తి, డి.వెంకట్రావు, ఎస్.హేమసుందర్‌రాజు, కె.బాలకృష్ణారావు, హెచ్.వెంకటేశ్వరరావు, బి.మోహన్‌రెడ్డి, సత్తారు సత్యం, ఎన్.భీమారావు, పి.మోహన్, టి.పాల్గుణరావు, పి.వెంకట్రావు, ఆర్.జయమోహన్, ఎస్.గణపతిరావు, కె.జీవన్, బి.దివాకర్, బి.వెంకటరమణ, ఎ.రాహుల్, యు.తమ్మయ్య, బి.రాకేష్, జె.బాబురావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పనులు చేపట్టాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో వి.తిరుమలరావు సూచించారు. మండలంలోని జాడుపూడి పంచాయతీ కేంద్రంలో జరుగుతున్న ఊర చెరువు పనులను శనివారం పరిశీలించారు. సరాసరి వేతనం రోజుకు రూ.300 వచ్చేలా పనులు చేపట్టాలన్నారు. ఎండాకాలం దృష్ట్యా ఉదయం 6 గంటలకే పనులు ప్రారంభించడం మంచిదన్నారు. ఆయనతో పాటు డ్వామా ఏపీవో జి.ధనుంజయ, టీఏ రేణుక, క్షేత్రసహాయకుడు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ధర్మారావు

వజ్రపుకొత్తూరు: మండలంలోని రెయ్యిపాడు పంచాయతీ పరిధి పెద్ద బత్సలవానిపేట గ్రామంలో రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ బత్సల ధర్మారావు శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ ఏకగ్రీవ నిధులు సుమారు రూ.3 లక్షల వ్యయంతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని రోడ్డును శంకుస్థాపన చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సూర్ల శాంతారావు, బత్సల వైకుంఠరావు, కర్రి ఢిల్లీశ్వరరావు, అంగ ప్రభాకరరావు, పుచ్చ కోదండరావు, విఘ్నేశ్వరరావు, సూర్యనారాయణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న అభయాంజనేయ స్వామి



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి లేబర్ కాలనీలో ఉన్నటువంటి అభయాంజనేయ స్వామివారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీమావుడురి రామప్రసాద్ ఆధ్వర్యంలో అర్చనలు, హోమాలు చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పూజా కమిటీ నిర్వాహకులు అంబటి ఆనందరావు, ధర్మాపు విజయ్, గజ్జి బాలయ్య, ఎం.కామేష్, పాట్నూరు అచ్యుతరావు, పాట్నూరు షణ్ముఖరావు, బమ్మిడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మండపం నిర్మాణానికి భూమిపూజ



మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలంలోని కేసరపడ పంచాయతీ పరిధి సామంత జక్కర గ్రామంలో ఉన్న స్వర్గధామంలో మండపం నిర్మాణానికి స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి చేతులమీదుగా శనివారం భూమిపూజ చేపట్టారు. ఈ మండపం నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కప్పల యుగంధర్, మెండ ప్రకాశరావు, కొణపల సురేష్, మద్దు అభియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలి



నందిగాంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న చిన్నారులు



టెక్కలి: మృతులకు నివాళులర్పిస్తున్న తైక్వాండో క్రీడాకారులు



కాశీబుగ్గ: పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు



ఇచ్ఛాపురం: నివాళులర్పిస్తున్న క్రీడాకారులు, అలయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్ సభ్యులు



మందస: కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న విద్యావంతులు, గ్రామస్తులు

ప్రపంచంలో ఏ రూపంలో ఉన్నా ఉగ్రవాదం నశించాలని వక్తలు పిలుపునిచ్చారు. పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రమూకల దాడులను ఖండిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలు శనివారం ర్యాలీలు నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉగ్రవాదం నశించాలి.. ప్రపంచ శాంతి నెలకొల్పాలని నినాదాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

మట్టి తొలగింపు

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలో పైపులైన్ ద్వారా అందిస్తున్న తాగునీటికి ఆధారమైన ఊట బావుల్లో శనివారం మున్సిపల్ యంత్రాంగం మట్టి తొలగింపు చర్యలు చేపట్టింది. బాహుదా నదిలో ఉన్న ఊట బావుల్లో మట్టి తొలగిస్తే నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని, దీనివల్ల మున్సిపాలిటీలో నీటి సరఫరా మెరుగుపడుతుందని మున్సిపల్ ఏఈ టి.పృథ్వీ అన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

వజ్రపుకొత్తూరు రూరల్: వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నటువంటి ఇళ్లను ఈ ఏడాది మే 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్ట్ సీహెచ్ మల్లేశ్వరరావు సూచించారు. గతంలో యూనిట్ విలువ రూ.1.80 లక్షలతో లబ్ధిదారులకు మంజూరు చేయడం జరిగిందన్నారు. 2024 నుంచి 2029లో పేదవారికి ఇళ్లు లక్ష్యంగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయంతో ఇళ్లను మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొంత ఇంటి స్థలం ఉన్నవారు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.

క్లుప్తంగా

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో మే 10వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జూలై 5వ తేదీకి వాయిదా పడినట్లు సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మే 10వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్, జూలై 5వ తేదీకి వాయిదా పడిందని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షురాలు, జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు జూన్ 5వ తేదీన జరగనున్న లోక్ అదాలత్‌కు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమయం ఎక్కువ ఉన్నందున ఎక్కువ సంఖ్యలో రాజీపడదగ్గ కేసులను గుర్తించాలని కోరారు.

బాహుదాకు నీటిని విడుదల చేయండి



పూర్తిగా ఎండిపోయిన బాహుదానది

ఇచ్ఛాపురం: పట్టణానికి ఆనుకొని ఉన్న బాహుదా నదికి ఒడిశాలో నిర్మించిన బగలట్టి డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడిశ్యామ్‌ప్రసాద్ రెడ్డి కోరారు. ఈ మేరకు మైనర్ ఇరిగేషన్ ఒడిశా వాటర్ రీసోర్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఇంజినీర్ చిన్మయ్ రంజన్ రౌత్‌కు మెయిల్ ద్వారా విన్నవించారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో నివసిస్తున్న సుమారు 40వేల మందికిపైగా ప్రజలు తాగునీరు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు కోరారు.

వేసవి శిక్షణ శిబిరాలు



శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

టెక్కలి: పట్టణానికి చెందిన ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో శనివారం నుంచి వేసవి విజ్ఞాన వినోద శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మే 16 వరకు నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యు.గణపతిరావు, చిలుకు కృష్ణారావు, ఎం.తాతయ్య, ఎ.చిట్టెన్న, డి.ఎ.స్టాలిన్, బి.అయ్యబాబు, ఆర్.వి.రమణమూర్తి, జి.మోహన్‌రావు, టి.వైకుంఠరావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

కవిటి: మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం శనివారం నిర్వహించారు. వీధి దీపాల నిర్వహణ, పరిశుభ్రత నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇంటిపన్ను వసూళ్ల విషయంలో బకాయిలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘంలో కాలువల్లో పారిశుద్ధ్య పనులు శనివారం ప్రారంభించారు. ప్రత్యేక నిధులతో చేపడుతున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ జంట పట్టణాల్లో చేపట్టారు. కాశీబుగ్గ ఏరియాలో గున్నేశ్వరనగర్, పూజారివీధి, తిలక్ నగర్ వెనుకవైపు, పలాస ఏరియాలో కాలేజ్ రోడ్డు, అన్నపూర్ణ ఆశ్రమం వీధి, సీతారామ నగర్ ప్రాంతాల్లో కాలువల్లో డీసిల్టేషన్ పనులు పూర్తి చేశారు. పనులను క్షేత్రస్థాయిలో కమిషనర్ నడిపేన రామారావు పర్యవేక్షణలో జరిగాయి.

దరఖాస్తులు చేసుకోవాలి

సోంపేట: శ్రీకాకుళం జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార సంస్థ ఆధీనంలోని అర్హులైన మండలంలోని షెడ్యూల్డ్ కులముల వారు మే 10వ తేదీలోగా కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం, మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.